క్లుప్తంగా

మహిళా ఉద్యోగులతో అసభ్యంగా ప్రవర్తిస్తే చర్యలు

కడప కోటిరెడ్డిసర్కిల్: ఏపీఎస్‌ఆర్టీసీలోని వివిధ డిపోలలో కింది స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు విధులు నిర్వర్తిస్తున్న మహిళా ఉద్యోగినులపై అసభ్యంగా ప్రవర్తించినా, లైంగిక వేధింపులకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఓ డిపోలో పనిచేస్తున్న డిప్యూటీ సూపరింటెండెంట్ అదే డిపోలో పనిచేస్తున్న కిందిస్థాయి మహిళా ఉద్యోగినిపై లైంగిక వేధింపులకు పాల్పడినందుకు ఈ నెల 23వతేదీన విధుల నుంచి సస్పెండ్ చేశామన్నారు. మహిళా ఉద్యోగుల విషయంలో అనుచితంగా, అసభ్యకరంగా ప్రవర్తించే వారిని ఉపేక్షించబోమని ఆయన హెచ్చరించారు.

27న ఉచిత వైద్య శిబిరం

కడప కల్చరల్: కడప నగరంలోని కులదీప్ ఆస్పత్రిలో ఈ నెల 27న అలర్జీ సమస్య ఉన్న వారికి ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నామని ప్రముఖ చెవి, ముక్కు, గొంతు సర్జన్ డాక్టర్ ఎస్.కులదీప్ తెలిపారు. ఆస్పత్రి 14వ వార్షికోత్సవం సందర్భంగా నెహ్రూ పార్కు ఎదురుగా ఉన్న తమ ఆస్పత్రిలో రోగులు సంప్రదించాలని ఆయన కోరారు.

ఉచిత ఆధ్యాత్మిక శిబిరం

కడప కల్చరల్: స్థానిక అక్కాయపల్లె మహమ్మదీయ సిద్దిఖి మసీదు కమిటీ ఆధ్వర్యంలో 30 రోజుల ఉచిత ఆధ్యాత్మిక వేసవి శిక్షణ శిబిరం శుక్రవారం నుంచి ప్రారంభమవుతుందని కార్యక్రమ కన్వీనర్ ఎస్.కరీముల్లా తెలిపారు. సంస్థ కార్యాలయంలో గురువారం శిక్షణ శిబిరం వివరాలు తెలిపే బ్యానర్‌ను ఆయన ఆవిష్కరించారు.రోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పవిత్ర ఖురాన్ నేర్పించడం, ఇస్లామిక్ ఆధ్యాత్మిక పాఠాలు, క్రమశిక్షణ, ప్రవక్తల జీవిత విశేషాలు తెలిపే తరగతులు ఉంటాయన్నారు. పూర్తి వివరాలకు 80997 82228, 99891 41475 నెంబర్లలో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వహణ కమిటీ అధ్యక్షుడు కరీముల్లా, కార్యదర్శి సుబాన్, కన్వీనర్ మగ్బూల్ అహ్మద్, మౌలాన జలీల్, రఫీ, హిదాయతుల్లా తదితరులు పాల్గొన్నారు.

పురస్కార గ్రహీతకు సత్కారం

కడప కల్చరల్ : కందుకూరి నాటక రంగ పురస్కారాన్ని అందుకున్న డాక్టర్ మూల మల్లికార్జునరెడ్డిని కడప నగరంలో గురువారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సిద్దార్థ స్కూల్ కరస్పాండెంట్ ఎస్.లక్ష్మయ్య మాట్లాడుతూ డాక్టర్ మూల మల్లికార్జునరెడ్డికి ప్రొద్దుటూరులోని ఓ సంస్థ నటభూషణ బిరుదు కూడా ప్రదానం చేయడం ఆయన ప్రతిభకు కొలమానమన్నారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

చిన్నారులకు అన్నదానం

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప ప్రకాశ్‌గర్‌లోని ప్రభుత్వ బాలుర హాస్టల్‌లోని చిన్నారులకు దాత యమ్మనూరు ఇందిర గురువారం అన్నదానం చేశారు. హిమవర్షిణి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఇందిర మాట్లాడుతూ అన్ని దానాలకంటే అన్నదానం పుణ్యదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో గుండ్లకొండ విజయలక్ష్మి, రవి, రెడ్డిలక్ష్మణ్, వెంకట సురేష్‌బాబు, దామోదర్, మధు తదితరులు పాల్గొన్నారు.

నేడు నిరసన ర్యాలీ

కడప కల్చరల్: కశ్మీర్‌లో జరిగిన మారణకాండను నిరసిస్తూ శుక్రవారం సాయంత్రం ఐదు గంటలకు నగరంలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నామని హిందూ జేఏసీ కడప శాఖ ప్రతినిధులు తెలిపారు. స్థానిక వైఎస్సార్ స్మారక ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో చిన్మయమిషన్ జిల్లా అధ్యక్షుడు స్వామి తురియానంద మాట్లాడుతూ ఏ మతం, ఏ దైవం సాటి మనిషిని చంపమని చెప్పదన్నారు. వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు నందారపు చెన్నకృష్ణారెడ్డి, రామమహేష్, భాస్కర్ వర్మ, శ్రీధర్ శర్మ, లెక్కల కొండారెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

మద్యం బాబులకు జరిమానా

కడప అర్బన్: మద్యం తాగి మోటార్ సైకిల్ నడుపుతూ పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన వ్యక్తి కి 14 రోజుల జైలు శిక్ష, రూ 3000 జరిమానా విధిస్తూ ఫస్ట్ స్పెషల్ జుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు మేజిస్ట్రేట్ మంగళగౌరి గురువారం తీర్పునిచ్చారు. ఈశ్వర్ (35) ఈ నెల 19వతేదీన మద్యం తాగి మోటార్ సైకిల్ నడుపుతుండగా కడప ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడ్డారు. నేరం రుజువు కావడంతో మెజిస్ట్రేట్ శిక్షను విధించారు.

బిఈడీ కాలేజీలపై చర్యలు తీసుకోవాలి

కడప ఎడ్యుకేషన్: నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న బిఈడీ కాలేజీలపై చర్యలు తీసుకోవాలని జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ తెలిపారు. యోగి వేమన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ పద్మను గురువారం ఆయన కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న బీఈడీ కాలేజీల్లో స్టాఫ్ ఉండరని, కనీసం ల్యాబ్ సౌకర్యాలు కూడా ఉండవని అన్నారు. ఎడ్‌సెట్ నోటిఫికేషన్ రాక ముందే యువకులను చేర్చుకుంటున్నారన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్: ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ విద్యాహక్కు చట్టంలో భాగంగా రాయలసీమ పరిధిలోని ప్రైవేటు పాఠశాలల్లోని పేద విద్యార్థులు 25 శాతం అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల విద్య ఆర్‌జేడీ కాగిత శామ్యూల్ సూచించారు.

రైలు కదిలిందా.. బతుకు గోవిందా





కిక్కిరిసిన రైళ్లలో కొందరు విన్యాసాలు చేస్తుండడం చూశాం.. సీట్ల కోసం యుద్ధం చేస్తూ.. స్థలం లేక రైలు పైకెక్కి పడుకోవడం చూశాం. అయితే తాజాగా, అంతా అవాక్కయ్యే విధంగా ఎండ వేడిమి తాళలేకో.. గూడ్స్‌లో చోటు లేకో.. ఇదిగో ఇలా ఏకంగా రైలు బండి చక్రాల మధ్య పడకేసేశారు. చూసిన వారంతా.. ఇవి రైలు పట్టాలా లేక లాడ్జీల పడకలా అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. రైలు కదిలితే మాత్రం ప్రాణాలు పణంగా పెట్టాల్సిందే మరి. కడపలో కనిపించిన ఈ దృశ్యాలు సాక్షి కెమేరాకు చిక్కాయి.

– రమేష్ తీట్ల, సాక్షి ఫొటోగ్రాఫర్, కడప





అకారణంగా ఆర్పీలను తొలగిస్తే ఊరుకోం



మాట్లాడుతున్న వేణుగోపాల్

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: మెప్మాలో 16 ఏళ్లుగా కనీస వేతనాలకు నోచుకోకుండా పనిచేస్తున్న ఆర్పీలను అకారణంగా తొలగించేందుకు ముందుకు వస్తే చూస్తూ ఊరుకోబోమని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జి.వేణుగోపాల్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ.బాదుల్లా, ఆర్పీ యూనియన్ నాయకురాళ్లు పద్మ, విజయలక్ష్మి, కళావతి, విజయ హెచ్చరించారు. నగరంలోని ఎన్జీయూ కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడుతూ మహిళాకాశం యాప్ రద్దుచేసి వేతనాలు వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. ఆర్పీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కడప కలెక్టరేట్ ఎదుట ఈ నెల 28న ధర్నా చేస్తున్నట్లు వారు ప్రకటించారు. కొందరు నాయకులు ఆర్పీలను బెదిరింపులకు గురిచేస్తున్నారని, ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. చాలామందికి రూ.5 వేలకు మించి వేతనం రావడం లేదని, కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకే రకమైన డ్రెస్‌కోడ్ అమలు చేయాలని, గుర్తింపు, హెల్త్ కార్డులు ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో క్రాంతి, గాయత్రి, వెంకటసుబ్బమ్మ, రాధిక, ఇందిర, చాందిని, వెంకటేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే అడ్డుకుంటాం



మాట్లాడుతున్న వీరపోగు రవి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: జిల్లా వ్యాప్తంగా వేసవి సెలవుల్లో నిబంధనలకు వ్యతిరేకంగా తరగతులు నిర్వహిస్తే అడ్డుకుంటామని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎద్దు రాహుల్, వీరపోగు రవి పేర్కొన్నారు. నగరంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడుతూ వేసవిలో ఎండలు తీవ్రంగా ఉండడంతో ఏప్రిల్ 23వ తేదీ నుంచి జూన్ 12వ తేదీ వరకు వేసవి సెలవులు ప్రకటించారన్నారు. ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో నిబంధనలకు వ్యతిరేకంగా క్లాసులు నిర్వహిస్తున్నా మండల, జిల్లా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. క్లాసులు నిర్వహించే విద్యా సంస్థలను అడ్డుకొని ఉద్యమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎర్రంపల్లి అజయ్ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె నోటీసు



ఏసీకి వినతి పత్రం ఇస్తున్న కార్మికులు

కడప కార్పొరేషన్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నగరపాలక అడిషనల్ కమిషనర్ రాకేష్‌చంద్రకు గురువారం కార్మికులు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ 30 ఏళ్లుగా నగరంలో ప్రజలకు సేవలందిస్తున్న కార్మికులకు రిటైర్‌మెంట్ బెనిఫిట్లు ఇవ్వకుండా తొలగించడం దారుణమన్నారు. కార్మికుల సేవలను గుర్తించకుండా 60 ఏళ్లు పైబడిందని ఇంటికి పంపడం భావ్యం కాదన్నారు. ఉద్యోగ వయోపరిమితిని రెండేళ్లు పెంచి వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్ల కింద రూ.10 లక్షలు, పింఛన్ రూ.10 వేలు ఇవ్వాలన్నారు. కాని పక్షంలో మే 2వతేదీ తర్వాత ఏ రోజైనా సమ్మె చేపడతామని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం కార్మికుల పట్ల అనుసరిస్తున్న విధానాలను వ్యతిరేకిస్తూ మే 20వ తేదీన దేశ వ్యాప్త సమ్మెలో కార్మికులు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నగర అధ్యక్షులు చంద్రారెడ్డి, కార్యదర్శి వెంకటసుబ్బయ్య, ఎస్.రవి, ఇ.ప్రకాష్, ఎస్. కిరణ్, నాగరాజు, అరుణ్, ఆదాం, ఓబయ్య, సాయమ్మ పాల్గొన్నారు.

బాలాజీ నగర్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభించిన ఈఈ, తదితరులు

కడప కార్పొరేషన్: కడప నగరంలోని బాలాజీ నగర్ 33/11కేవీ విద్యుత్ ఉప కేంద్రంలో ప్రస్తుతమున్న 5 కేవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 8 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినట్లు కడప డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ హరిసేవ్యా నాయక్ తెలిపారు. పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గురువారం ఆయన పూజలు చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా హరిసేవ్యా నాయక్ మాట్లాడుతూ వేసవిలో విద్యుత్ సరఫరాలో సమస్యలు రాకుండా, అంతరాయం ఏర్పడకుండా, లో వోల్టేజ్ సమస్య ఉత్పన్నం కాకుండా నాణ్యమైన విద్యుత్ ప్రజలకు అందచేయుటకు ఈ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇకపై చెమ్ముమియాపేట, బాలాజీ నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలు ఉత్పన్నం కావని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌టీ ఈఈ రమణారెడ్డి, టౌన్ 1 డీఈఈ శేషారెడ్డి, టీఆర్ఈ అండ్ ఎస్‌పీఎం డీఈఈ సుబ్బారావు, ఏఈలు సురేష్, భరత్, వీరయ్య పాల్గొన్నారు.

అభివృద్ధిలో కీలకం పంచాయతీ రాజ్ వ్యవస్థ



గ్రీన్ అంబాసిడర్‌ను సత్కరిస్తున్న ఇన్‌చార్జ్ డీపీఓ

సిద్దవటం: జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని ఆయా మండల కేంద్రాల్లో ఎంపీడీఓలు, పంచాయతీ రాజ్ శాఖ అధికారుల ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఒంటిమిట్టలో జరిగిన గ్రామసభకు ముఖ్య అతిథిగా జిల్లా ఇన్‌చార్జ్ పంచాయతీ అధికారి సయ్యద్ ఖాదర్ బాషా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ వ్యవస్థ 1992 73వ రాజ్యాంగ చట్ట సవరణ చేసి, 1993 ఏప్రిల్ 24న అమలులోకి వచ్చిందన్నారు. 2010 ఏప్రిల్ 24న పంచాయతీరాజ్ దినోత్సవాన్ని అప్పటి ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ ప్రారంభించారన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థ ఏర్పడినప్పటి నుంచి జనన, మరణ ధృవీకరణ పత్రం మొదలుకొని మానవుడు పుట్టినప్పుడు నుంచి చనిపోయే వరకు అన్ని సౌకర్యాలు గ్రామ పంచాయతీ ద్వారా కల్పించారన్నారు. అనంతరం ఈ వేడుకలలో గ్రీన్ అంబాసిడర్లను శాలువాలతో సత్కరించి వారికి పప్పు, ఉప్పు, చక్కెర, కాయగూరలు వంటివి ఒక్కొక్కరికి రూ.1000లు విలువచేసే వస్తువులను జిల్లా ఇన్‌చార్జ్ పంచాయతీ అధికారి, ఉప సర్పంచ్ చేతులమీదుగా అందజేశారు. ఆయా కార్యక్రమాలలో ఎంపీడీఓలు శేఖర్‌నాయక్, ఫణిరాజకుమారి, డిప్యూటీ ఎంపీడీఓ సురేష్‌బాబు, సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు, గ్రీన్ అంబాసిడర్స్, పంచాయతీ కార్యదర్శిలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పట్టుదలతో చదివి.. పదిలో మెరిసి

కడప ఎడ్యుకేషన్: పదో తరగతి విద్యార్థులు పట్టుదలతో చదివారు. అత్యధిక మార్కులు సాధించి భళా అనిపించారు. ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల్లోనూ విద్యార్థులు ప్రతిభ చాటారు.

పది ఫలితాల్లో శ్రీసాయి కృష్ణ భళా



విద్యార్థులతో ఆదినారాయణరెడ్డి, సుశీల

పది పరీక్ష ఫలితాలు వెలువడగా శ్రీసాయికృష్ణ హైస్కూల్‌లో 108 మందికి గానూ 104 మంది ఉత్తీర్ణులయ్యారు. విద్యార్థిని తుషారా, శివలాస్య 593, వరణ్ సాయితేజ్‌కు 592 మార్కులు సాధించారు. పాఠశాల వ్యవస్థాపకుడు ఆదినారాయణరెడ్డి, కరస్పాండెంట్ సుశీల విద్యార్థులను అభినందించారు.

వశిష్ట ఇంగ్లీష్ మీడియం స్కూల్ భేష్



నవ్యశ్రీ



క్రిష్ణతేజ

నగరంలోని వశిష్ట ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు 33మంది పది పరీక్షలు రాయగా అందరూ ఉత్తీర్ణులై భేష్ అనిపించారు. నవ్యశ్రీ 596 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచిందని కరస్పాండెంట్ రమణారెడ్డి తెలిపారు. క్రిష్ణతేజ 579, సఫియా సుల్తానా 555 మార్కులు సాధించారు. కరస్పాండెంట్ రమణారెడ్డి వారిని అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న జోగిరామిరెడ్డి

మెరిసిన పవన్ విద్యార్థులు

కడప అక్కాయపల్లెలోని పవన్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు పది ఫలితాల్లో మెరిశారు. స్రవంతి 596 మార్కులతో టాపర్‌గా నిలవగా, స్నేహలత 594, మాలిక్‌బాషా 588, మణికంఠ 586, వెంకట యశ్విత 585, 20 మంది 550కి పైగా మార్కులు సాధించారు. కరస్పాండెంట్ జోగిరామిరెడ్డి, ఉపాధ్యాయులు వారిని అభినందించారు.

శాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు



సాయి లిఖిత



యశశ్వి అరుణ



గంగా ప్రదీప్తి

కడప నగరం శంకరాపురంలోని శాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు పది ఫలితాల్లో రాణించారు. గంగా ప్రదీప్తి 579, యశశ్విఅరుణ 576, మునిసాయి లిఖిత 574, దొమ్మెటి వీరమణికంఠ రావు 567, షేక్ మేషక్ ఫాతిమా 554, గాజులపల్లి వెంకట లక్ష్మిదేవి 551 మార్కులు సాధించారు. విద్యార్థులను కరస్పాండెంట్ ఎలియాస్‌రెడ్డి అభినందించారు.

పర్యాటకులపై ముష్కరుల దాడి పిరికిపందల చర్య



కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న నాయకులు



దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న విద్యార్థులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్ర దాడి పిరికిపంద చర్య అని, దాడికి పాల్పడిన ముష్కరులను కఠినంగా శిక్షించాలని సీపీఎం కడప నగర కార్యదర్శి ఎ.రామమోహన్ అన్నారు. కడప అంబేద్కర్ సర్కిల్ లో హంతక ముఠాల తుపాకీ గుండ్లకు బలైన వారికి తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తూ కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాణం విలువ తెలియని కిరాతక హంతకుల దుష్ట చర్యలను సమాజం ఖండించాలని పిలుపు నిచ్చారు. కేంద్రంలో బీజేపీ చేతగానితనం కారణంగానే ఈ ఉగ్ర దాడులు జరిగాయని ఆక్షేపించారు. కల్లబొల్లి మాటలు, కాలక్షేపాన్ని వదిలేసి భారతీయుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని కోరారు. జమ్మూ కాశ్మీర్లో శాంతిభద్రతలను పునరుద్ధరించామన్న మోదీ, అమిత్‌షా ప్రచారం బూటకమని తేలిపోయిందన్నారు. క్షతగాత్రులకు ఉన్నత స్థాయి వైద్యం అందించాలని, అందరూ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మనోహర్, దస్తగిరిరెడ్డి, కె.శ్రీనివాసులురెడ్డి, చంద్రారెడ్డి, రామకష్ణారెడ్డి, శివకుమార్, కుమారస్వామిరెడ్డి, విజయ్, నరసింహ, గోవిందు, రవి, జార్జి, అజయ్ రాహుల్, ఉదయ్, శ్రీను, సురేంద్ర, సాయి తదితరులు పాల్గొన్నారు.

కడప ఎడ్యుకేషన్: దేశంలో ఉగ్రవాదం అంతమయ్యే వరకూ ఉద్యమిస్తామని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు గళమెత్తారు. జమ్ము కశ్మీర్ రాష్ట్రంలోని పెహల్గామ్ ఉగ్ర దాడుల్లో మరణించిన వారికి సంతాపంగా ఆ పాఠశాల డైరెక్టర్ వివేకానంద రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం చేశారు. వివేకానందరెడ్డి మాట్లాడుతూ ఉగ్రవాదులకు కఠిన శిక్షలు వేయడంతోపాటు భవిష్యత్తులో పునరావృతం కాకుండా చట్టాలు తీసుకుని రావాలంటూ విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ హరికృష్ణ, సంధ్య, పీఈటీ చంద్ర, ఏవో చంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

కడప రూరల్: జమ్ము కశ్మీర్‌లో జరిగిన ఉగ్ర దాడిని ఖండిస్తూ జనసేన పార్టీ జిల్లా నాయకులు జీవీ రమణ ఆధ్వర్యంలో గురువారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో శాంతియుత నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. జమ్ము కశ్మీర్‌లో యాత్రికులపై ఉగ్రమూకలు దాడికి పాల్పడడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదులపై కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో రవీంద్రబాబు, బలిశెట్టి సాయి, గజ్జల సాయి, ఉంగరాల విజయ్, ఆకుల గోపి, తోట సుమన్ తదితరులు పాల్గొన్నారు.

కడప రూరల్ : జమ్ము కశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదులు సృష్టించిన మారణ కాండకు నిరసనగా శుక్రవారం సాయంత్రం స్థానిక 40వ డివిజన్‌లో కొవ్వొత్తులతో సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి మాట్లాడుతూ జమ్ము కశ్మీర్ అభివృద్ధివైపు పయనిస్తున్న తరుణంలో ఉగ్రవాదులు ఓర్వలేక దుశ్చర్యలకు పాల్పడడం దారుణమన్నారు. ఈ సంఘటన పిరికిపంద చర్యగా అభివర్ణించారు. మృతులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

కడప సెవెన్‌రోడ్స్: జమ్ముకశ్మీర్‌లో జరిగిన ఉగ్రవాదుల దుశ్చర్యని మానవత్వం ఉన్న ప్రతి వ్యక్తి ఖండించాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. రామకృష్ణ నగర్‌లో కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ పర్యాటకులపై రాక్షస మూకల కిరాతక చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కేంద్ర హోం మంత్రి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.మక్బూల్‌బాషా, చాపల సుబ్బరాయుడు, లక్ష్మీదేవి, మహేష్ పాల్గొన్నారు.

పర్యాటకులపై ఉగ్రదాడి దుర్మార్గం

కడప ఎడ్యుకేషన్: జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గావ్‌మ్‌లో 23వ తేదీ జరిగిన ఉగ్రవాద దాడి దుర్మార్గమని ఆర్‌ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ అన్నారు. రేవల్యూషనరి విద్యార్థి సంఘం (ఆర్. ఎస్. యు) ఆధ్వర్యంలో కడప నగరంలోని ప్రభుత్వ బీసీ కళాశాల వసతి గృహంలో కొవ్వొత్తులతో నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమాయకులైన పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ విషయంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉగ్రవాదం పట్ల కఠినంగా వ్యవహరించాలని లేకుంటే దేశంలో ప్రజలు అభద్రతభావనికి గురవుతారని తెలిపారు. క్షత గాత్రులకి ఉన్నత స్థాయి వైద్యం అందించాలని. చనిపోయిన కుటుంబాలకు నష్ట పరిహారం ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. త్వరలో అందరూ కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఎస్ యు నగర అధ్యక్షుడు కొండేటి హరిబాబు. సందీప్. కిరణ్. కళ్యాణ్. మోహన్, తదితరులు పాల్గొన్నారు .

ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ దేవిరెడ్డి శ్రీలక్ష్మి

కడప కోటిరెడ్డిసర్కిల్: జిల్లా స్థాయిలో ప్రధాన మంత్రి మాతృ వందన యోజన స్కీమ్‌పై సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ పీడీ దేవిరెడ్డి శ్రీలక్ష్మి పిలుపునిచ్చారు. కడప నగరంలోని కలెక్టరేట్ సభా భవనంలో ఐసీడీఎస్ సిబ్బందికి గురువారం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ గర్భిణులు తొమ్మిది నెలల లోపు ఈ పథకానికి రిజిస్టర్ చేసుకోవాలన్నారు. తొలివిడతగా రూ.3000, రెండవ విడతలో రూ.2000 అకౌంట్‌లో జమ చేస్తారన్నారు. రెండవ కాన్పులో ఆడపిల్ల పుడితే మాత్రమే ఈ పథకం అమలు అవుతుందన్నారు.

సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలి

కడప ఎడ్యుకేషన్: యోగి వేమన యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో ఇయర్ ప్యాటర్న్ విద్యార్థులకు మెగా సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలని ఏఐఎస్‌బీ జిల్లా కన్వీనర్ సగిలి రాజేంద్ర ప్రసాద్ కోరారు. వైవీయూ రిజిస్ట్రార్ పద్మను గురువారం ఆయన కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి కడప జిల్లాలోని యోగివేమన యూనివర్సిటీ విద్యార్థులు బ్యాక్ లాగ్ సబ్జెక్టులు పెండింగ్‌లో ఉండటంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు.

ఉర్దూ డీఐ పోస్టులను భర్తీ చేయాలి

కడప ఎడ్యుకేషన్: రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉర్దూ డీఐ పోస్టులను రాష్ట్ర ప్రభుత్వ భర్తీ చేయాలని రూట రాష్ట్ర కో ఆర్డినేటర్ షేక్ ముహమ్మద్ అయ్యూబ్ కోరారు. కడప ఎన్జీయూ కార్యాలయంలో ఫ్యాప్టో చైర్మన్ సాయిశ్రీనివాస్‌ను గురువారం ఆయన కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉర్దూ డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్జీయూ జిల్లా అధ్యక్షుడు ముహమ్మద్ ఇలియాస్ బాషా, ఎఫ్ఎం .ఖాదర్, సురేష్‌బాబు, సనావుల్లా, మహబూబ్ బాషా, వాజిద్ పాల్గొన్నారు.

బదిలీల సమాచారం కోసం ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలి

కడప ఎడ్యుకేషన్: వేసవి సెలవుల్లో నిర్వహించే ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల సమాచారం కోసం ప్రత్యేక సెల్ ఏర్పాటుచేయాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు జనార్దన్‌రాజు కోరారు. కడపలో డీఈఓ షేక్ షంషుద్దీన్‌ను గురువారం ఆయన కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుభవిజ్ఞులైన మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, జిల్లా విద్యాశాఖ కార్యాలయ సిబ్బందితో ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రామ కృష్ణంరాజు, చలపతి రాజు, అబ్దుల్ గఫూర్, నారాయణరెడ్డి, లక్ష్మినారాయణ, బచ్చల శ్రీనివాసులు, కులశేఖర్ రెడ్డి, చక్రపాణి పాల్గొన్నారు.

బాటలో కొబ్బరి కాయలు





భానుడి తాపానికి దాహార్తి పెరుగుతోంది. అడుగు బయట పెట్టామంటే శరీరం వేడికి ఆవిరైపోతోంది. జనం ఎక్కువ నీటి శాతం కలిగిన వాటిపై మక్కువ చూపుతున్నారు. బాటలో కనిపిస్తే చాలు.. తీసుకుని దాహం తీర్చుకుంటున్నారు. ఎక్కువ దాహం తీర్చే వాటిలో కొబ్బరి బోండాం ఒకటి. ప్రకృతి సిద్ధమైన కొబ్బరికాయలు అన్ని రోజుల్లో లభిస్తాయి. ఎక్కువగా కేరళ, బెంగళూరు, మైసూరు, ఈస్ట్ వెస్ట్ నుంచి ఇవి వస్తాయి. ఈ వేసవిలో ఎక్కువమంది కొనడంతో డిమాండ్ పెరిగింది.. బాటసారులు వెళ్లే దారిలోనే వీటిని విక్రయిస్తున్నారు. గతంలో రూ.40 నుంచి రూ.50కి దొరికే కొబ్బరి కాయలు ఇపుడు ఏకంగా రూ.60 నుంచి రూ.70 వరకు విక్రయిస్తున్నారు.

–సాక్షి ఫోటో గ్రాఫర్, కడప